క్లుప్తంగా

స్వీట్లు, అల్పాహారం అందజేత



విభిన్న ప్రతిభావంతులకు అల్పాహారం అందిస్తున్న ఉద్యోగులు

చినగంజాం: క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకొని అంబేద్కర్ నగర్‌లో శనివారం విభిన్న ప్రతిభావంతులకు స్వీట్లు, అల్పాహారం అందజేశారు. అంబేద్కర్ నగర్ గ్రామ పెద్దలు, అంబేద్కర్ యూత్ సభ్యుల సహకారంతో ఎంప్లాయిస్ యూనియన్, క్యారల్స్ నిర్వాహకులు మేకల మేషక్ బాబు ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు స్వీట్లు, అల్పాహారం, భోజనం ప్యాకెట్‌లు అందజేశారు. ఉద్యోగులు జ్యోతి వెంకటేశ్వర్లు, గుంటూరు వినయ్‌కుమార్, డాక్టర్ హేమామాధురి, యూత్ సభ్యుడు బడుగు విజయ్, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి ఆకు పూజలు



ఆకు పూజలో పాల్గొన్న భక్తులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి ప్రీతికరమైన ఆకు పూజలు సతీసమేతంగా నిర్వహించారు. క్షేత్రప్రాధాన్యత గల శనివారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పొంగలి శాలలో పొంగళ్లు పెట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

గోశాలకు గడ్డి వితరణ



వరిగడ్డి అందజేస్తున్న డాక్టర్, రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పొన్నం వెంకట కిరణ్ ఆర్థిక సౌజన్యంతో శనివారం అద్దంకిలోని హరిహర గోశాలకు రూ. 15 వేల విలువ గల ట్రక్కు వరి గడ్డిని రోటరీ ద్వారా అందజేశారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, అళహరి హరిప్రసాద్, ఊటుకూరి రామకోటేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు, గోశాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమిని ఆక్రమించడం అన్యాయం

చీరాల రూరల్: ప్రభుత్వం సాగుకోసం దళితులకు ఇచ్చిన భూమిని రెవెన్యూ అధికారుల అండతో కొంతమంది అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నించడం దారుణమని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు అన్నారు. అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణతో కలిసి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1996లో పేరాల హారిస్‌పేటకు చెందిన తెలగతోటి కిషోర్‌కు ప్రభుత్వం ఈపురుపాలెం సర్వే 782/2లో 98 సెంట్ల భూమిని వ్యవసాయ సాగుకోసం ఇచ్చిందని చెప్పారు. ఆ భూమి కిషోర్ కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉందని, భూమికి సంబంధించి కోర్టులో కూడా వివాదం ఉందని చెప్పారు. అయితే అధికారుల అండతో ఆ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని షెడ్లు వేస్తున్నారని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని.. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేయనున్నట్లు పేర్కొన్నారు.

బతుకులు ఊడ్చేశారు

- కూటమి కుర్చీ ఎక్కినప్పటి నుంచి కార్మికులకు కూడు కరువు
- జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఎదురుచూపులు
- ఆరు నెలలుగా జీతాల్లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చీరాల టౌన్:

ప్రజలను ఆరోగ్యంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల గురించి పట్టించుకొనేవారు కానరావడంలేదు. తెల్లవారు జాము నుంచే గ్రామాల్లోని వీధులను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లి అందరికీ ఆరోగ్యం పంచుతున్నా వారి బతుకులు మాత్రం మారడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఠంచనుగా నెలనెలా జీతాలు అందుకునే వారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కడుపు నింపుకునేందుకు కష్టాలు పడుతున్నారు.

నెలల తరబడి జీతాల రాక.. అప్పులు పుట్టక అల్లాడుతున్న పాలకులు, అధికారులు కనీసం కనికరం చూపడం లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఉండాల్సి వస్తోంది. అయినప్పటికీ అలాగే విధులు నిర్వహిస్తున్నా పంచాయతీ, మండల స్థాయి అధికారులు కానీ,



జీతాల కోసం చీరాల ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

ప్రజాప్రతినిధులు కానీ వారి ఆకలి వెతలను మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం వారికి ఇవ్వాల్సి ఉన్న సబ్బులు, చెప్పులు, నూనెలు కూడా అందడంలేదు. సక్రమంగా వేతనాలు అందక చీరాల నియోజకవర్గంలోని చీరాల రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెం మండలంలో 9 గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్టు పద్ధతిలో 24 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 65 మంది, వేటపాలెం మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో 60 మంది మొత్తం 135 మంది ఉన్నారు. 24 పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల్లో చాలా మందికి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థాకలితో అలమటిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను కేవలం చెత్తచెదారాల తొలగింపుతో పాటు, కార్యాలయం స్వీపర్లుగా, వాచ్‌మెన్లుగా కూడా వివిధ రకాల విధులను నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారీతిన మాత్రమే కూలి అందిస్తూ వారి హక్కులను కాలరాస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేసే ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడికి రోజుకు రూ. 370 నుంచి రూ.400 వరకు మాత్రమే అందిస్తున్నారు. పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సక్రమంగా అందిస్తున్నారో.. లేదో చూడాల్సిన మండల, డివిజన్ స్థాయి అధికారులు, గ్రామాల ప్రజా ప్రతినిధులు పంచాయతీ కార్మికుల పట్ల కపట ప్రేమలను చూపిస్తున్నారే తప్ప తమకు జీతాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అంతేగాక పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫాంలను మూడేళ్ల నుంచి ఇవ్వడం లేదని అవికూడా త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధులు లేక జీతాల చెల్లింపుల్లో జాప్యం

పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇచ్చేది కాంట్రాక్టర్లు. పంచాయతీకి ఇస్తున్న ఆదాయం నుంచి వారికి చెల్లిస్తాం. అయితే పంచాయతీలకు ఆదాయం లేకపోవడంతోనే కార్మికులకు జీతాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడింది. 15 ఫైనాన్స్ నిధుల లేకపోవడం, అన్నింటికీ సాధారణ నిధులను వాడటం వలనే జీతాలు సక్రమంగా అందించడం లేదు. పది రోజుల్లోపు వేతనాలు ఇచ్చేలా కృషి చేస్తాం.

– పి.శివసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, చీరాల

వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన

పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. ప్రభుత్వం, మండల, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు ఇవ్వాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం.

– ఎం.వసంతరావు, సీఐటీయూ మండల కార్యదర్శి, చీరాల

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీఎం అనురాధ

ఇంకొల్లు(చినగంజాం): మహిళా గ్రూపు సభ్యులు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. ఇంకొల్లు మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం స్త్రీనిధి రుణాల పంపిణీకి సంబంధించి సభ్యుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వారికి 11 శాతం వడ్డీ వర్తిస్తుందని చెప్పారు. గ్రూపులో రుణాలు తీసుకునేందుకు గతంలో తీసుకున్న రుణాలు 100 శాతం చెల్లించి ఉండాలని, గ్రామ సంఘం అయితే 91 శాతం రికవరీ ఉండాలని, మండల సమాఖ్య 75 శాతం చేయాలన్నారు. ఏ గ్రేడ్ గ్రామ సంఘానికి రూ. 75 లక్షలు, బీ గ్రేడ్ గ్రామ సంఘానికి రూ. 65 లక్షలు, సీ గ్రేడ్ గ్రామ సంఘానికి రూ. 50 లక్షలు, డీ గ్రేడ్ గ్రామ సంఘానికి రూ. 40 లక్షలు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. సీసీలు అంజిరెడ్డి, అశోక్, రాజశేఖర్, అకౌంటెంట్ సుబ్బులు, వీఓఏలు, గ్రామ సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

అధికారుల సహకారంతోనే అభివృద్ధి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ఇంకొల్లు (చినగంజాం): మండలాభివృద్ధిలో అన్ని శాఖల అధికారుల పాత్ర కీలకమైనదని అంతా చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యం అని ఎంపీపీ బండారు అనూష అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సత్వర సేవలందించాలని సూచించారు. పలు శాఖల అధికారులు పాల్గొని ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, నిర్వహిస్తున్న పనులు, ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై దాడి దారుణం

చీరాల టౌన్: విధి నిర్వహణలో ఉన్న అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జవహర్‌బాబుపై దాడిచేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చీరాల ఎంపీడీఓ శివసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శనివారం చీరాల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే మండల పరిషత్ ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి పెన్‌డౌన్ చేసి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓపై దాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. స్థానిక ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగవన్నారు. అధికారుల పట్ల నాయకులు దురుసు ప్రవర్తన మానుకోవాలని హితవు పలికారు. ఈవోఆర్డీ రామకృష్ణ, సూపరింటెండెంట్ శర్మ, ఉద్యోగులు యరిచర్ల డానియేల్ ఉన్నారు.

పర్చూరు (చినగంజాం): అన్నమయ్య జిల్లా గలివీడు ఎంపీడీఓ జవహర్‌పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ పర్చూరు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు.

ఇంకొల్లు(చినగంజాం): మండల అభివృద్ధి అధికారి జవహర్ బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ ఇంకొల్లు మండల ప్రజాపరిషత్ సిబ్బంది శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నినాదాలు చేశారు.

రీసర్వేతో రైతులకు మేలు



గుంటుపల్లిలో సర్వే టీమ్‌కు సూచనలు ఇస్తున్న చీరాల ఆర్డీఓ

బల్లికురవ: రీసర్వే పారదర్శకంగా నిర్వహించేందుకు రైతులంతా సహకరించాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు కోరారు. రీసర్వేపై శనివారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో జరిగిన ర్యాలీకి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంలో రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు తమ వద్ద ఉన్న హక్కుపత్రాలను సర్వే టీంకు చూపించి లోపాలు తలెత్తకుండా నమోదు చేయించుకోవాలన్నారు. రెండు నెలల్లో రీసర్వే పూర్తి అవుతుందని వివరించారు. తహసీల్దార్ రవి నాయక్, డీటీ ప్రహర్ష, యం. గోవిందరావు, యం. శివన్నారాయణ పాల్గొన్నారు.

చీరాల టౌన్: భూముల రీ సర్వేతో సమస్యలు లేకుండా ఉంటాయని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని చీరాల నగర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూము రీసర్వే ప్రాజెక్టు ర్యాలీని ప్రారంభించారు. జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ ఎ.మునలయ్య, డిప్యూటీ తహసీల్దార్ దేవతోటి అర్జున్, మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, సచివాలయాల సర్వేయర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జె.పంగులూరు: రీ సర్వే జరిగే ప్రతి గ్రామంలో ఆయా గ్రామాల రైతులు అందుబాటులో ఉండి సర్వేని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. బైటమంజులూరులో 1635.54 ఎకరాలున్నాయన్నారు.

యద్దనపూడి: సమగ్ర భూసర్వేతో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చని తహసీల్దారు కె. రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని పూనూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డీటీ విష్ణు, సర్వేయర్ సాంబశివరావు, విలేజ్ సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): భూములు రీ సర్వేకు రైతులు తప్పనిసరిగా సహకరించాలని తహసీల్దార్ పి. బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని రమణాయపాలెం గ్రామంలో రీసర్వేపై రెవెన్యూ అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణ, బాలాంజనేయులు, ఎంఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

చినగంజాం: రైతులు రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు.

రీసర్వేకు సహకరించాలి



ఆదిపూడిలో అవగాహన ర్యాలీ చేస్తున్న తహసీల్దార్



దైవాలరావూరులో ర్యాలీ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

మేదరమెట్ల: భూమికి సంబంధించి రీ సర్వే నిర్వహిస్తున్నామని.. దీనికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ సుబ్బారెడ్డి కోరారు. కొరిశపాడు మండలం దైవాలరావూరులో శనివారం రీసర్వేపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

రీసర్వే పటిష్టంగా చేయండి

ఆదిపూడి (కారంచేడు): గ్రామాల్లో నిర్వహించే రీ సర్వేను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత అన్నారు. శనివారం ఆదిపూడిలో నిర్వహించనున్న రీసర్వే విషయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వరించారు. 30వ తేదీన గ్రామసభను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల సర్వేయర్ సత్యన్నారాయణ, వీఆర్ఓ, వీఆర్ఏలు, రీ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల నిల్వల్లో తేడాలు ఉంటే చర్యలు



గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

అద్దంకి: పౌరసరఫరా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సరుకుల నిల్వలో తేడాలు లేకుండా చూడాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తహసీల్దార్‌కు, గోడౌన్ అధికారులకు సూచించారు. శనివారం అద్దంకిలోని పౌరసరఫరాల శాఖ నిత్యావసర సరుకులు గోడౌన్‌ను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని రామ్‌నగర్‌కు యం. శ్రీనివాసరావు స్పందనలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన భూవివాదాన్ని పరిశీలించారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్ఐ శంకర్ పాల్గొన్నారు.

నరసింహారావుకు ఘన నివాళి

జె. పంగులూరు: అనారోగ్యంతో ఇటీవల మరణించిన గణిత ఉపాధ్యాయుడు తోట వెంకట నరసింహారావుకు పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు శనివారం ఘన నివాళులర్పించారు. నరసింహారావు 2017లో పంగులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడుగా చేరి, 2023లో రేణింగవరం ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. శనివారం నాడు జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కొప్పోలు రమాదేవి మాట్లాడుతూ నరసింహారావు నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడని, విద్యార్థుల భవిష్యత్తు నిమిత్తం కష్టపడి పని చేసేవారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీగిరి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌రావు, శాంతి, ఉమాదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులు ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న వక్త

చినగంజాం: దివ్యాంగులు అన్ని రంగాల్లో సకలాంగులతో సమానంగా ముందుకు సాగాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్, రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు దాసరి ఇమ్మానియేలు అన్నారు. ఎల్సీడీడీపీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో సరస్వతి విద్యానికేతన్ ఆవరణలో శనివారం దివ్యాంగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు సైకం ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. దివ్యాంగులకు సంబంధించిన వివిధ చట్టాల గురించి, హక్కుల గురించి, వినియోగదారుల హక్కులు, సమాచార హక్కు చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చీరాల బార్ అసోసియేషన్ తరఫున జీపీఆర్ విఠల్‌రెడ్డి, యు. స్నేహ, కోర్టు రిటైర్డ్ సూపరింటెండెంట్, పీఎల్‌వీ మార్కాపురం వెంకటరామారావు, జిల్లా వినియోగదారుల రక్షణ సమితి సభ్యులు ఎస్డీ మతిన్, మండల దివ్యాంగుల ఉపాధ్యక్షుడు వి. వేణు, గ్రామ పెద్ద దేవరకొండ శ్రీనివాసరావు, మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

తీరంలో వరాహాలు

చీరాల టౌన్: నిత్యం మత్స్యకారులు, పర్యాటకులతో కిటకిటలాడే వాడరేవు సముద్ర తీరం వరాహాలకు నిలయంగా మారింది. తీరం ఒడ్డున వరాహాలు గుంపులుగా స్వైర విహారం చేస్తుండటంతో అటు మత్స్యకారులు, ఇటు తీరానికి వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచారం అధికంగా ఉండే తీరం ఒడ్డున చేపల అమ్మకాలు చేసే ప్రదేశంతో పాటు పర్యాటకులు వేచి ఉండే ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతూ ఇబ్బందులుకు గురిచేస్తున్నాయి. వాటి వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని.. పర్యాటకులను ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.



తీరం ఒడ్డున గుంపులుగా సంచరిస్తున్న వరాహాలు

29న జిల్లా స్థాయి పోటీలు

చినగంజాం: జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు ఈ నెల 29వ తేదీ ప్రకాశం జిల్లా కొప్పోలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అడహక్ కమిటీ ప్రెసిడెంట్ పి. రామచంద్రరావు, కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెలలో నిర్వహించే 59 వ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మంగళవారానికి రిపోర్టు చేయాలని కోరారు. వివరాలకు 7675026270, 9989036635, 8074992796 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం. దక్షిణాయనం మార్గశిర మాసం జ్యేష్ఠ నక్షత్రం చతుర్థశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.